# సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్

## తెలంగాణ రాష్ట్ర కమిటి

# CENTRE OF INDIAN TRADE UNIONS

## Telangana State Committee

అధ్యక్షులు : చుక్క రాములు ప్రధాన కార్యదర్శి : ఎం. సాయిబాబు

ప్రచురణార్థం/ప్రసారార్థం తేది : 07-01-2021

## కార్మిక కోడ్‌లు, వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలి!

## కలెక్టరేట్ ముట్టడిలు - అనేక జిల్లాల్లో అరెస్టులు - మేడ్చల్‌లో లాఠీ ఛార్జీ పలువురికి గాయాలు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, 3 రైతు చట్టాలను రద్దు చేయాలని, ప్రతిపాదించిన విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2020ని ఉపసంహరించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ జనవరి 7, 8 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిలు మొదటి రోజు (జనవరి 7) రాష్ట్రంలో జయప్రదమయ్యాయి. కార్మికులు ఢిల్లీలో రైతాంగం చేస్తున్న పోరాటానికి కార్మికవర్గం అండగా ఉంటుందని, రైతులు తమ పోరాటాన్ని కొనసాగించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనేక జిల్లాల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోకి దూసుకెళ్ళేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లు, ముళ్ళకంచెలతో అడ్డుకొని కార్మికులను అరెస్టులు చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిలల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద లాఠీ ఛార్జీ జరిగింది. అనేక మంది కార్మికులు గాయపడ్డారు.

మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ముట్టడిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన కార్మిక కోడ్‌లను, కొత్త వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లు - 2020ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవడంతో పాటు విద్యుత్ సవరణ బిల్లు-2020ని ఉపసంహరించుకునేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద జరిగిన ముట్టడిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ విద్యా, వైద్యం, ప్రభుత్వరంగ సంస్థలు తదితర రంగాల్లో ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ముట్టడిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమ మాట్లాడుతూ ఆదాయపు పన్ను పరిధిలోకి రాని వారందరికీ రూ. 7,500/-లు నగదు బదిలీ చేయాలని, పేదలందరికీ ఒక్కొక్కరికి నెలకు 10 కేజీల బియ్యం నిరంతరాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ముట్టడిలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె. రమేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, దాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరింపచేయాలని, రోజుకు రూ. 700/-లకు తక్కువ కాకుండా వేతనం చెల్లించాలని, ఉపాధి కల్పన గ్యారంటీ చేయాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ముట్టడిలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని, అందరికీ సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ ముట్టడిలు వికారాబాద్, సూర్యాపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, గద్వాల్, కరీంనగర్, సిద్ధిపేట, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, తదితర జిల్లాల్లో జరిగాయి. 2వ రోజు (జనవరి 8)న జరిగే కలెక్టరేట్ ముట్టడిలను కూడా అత్యంత పట్టుదలతో నిర్వహించాలని, కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు కార్మికవర్గం సిద్ధం కావాలని, రైతాంగ పోరాటానికి సంఘీభావంగా ప్రస్తుతం చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నది.

(చుక్క రాములు)
రాష్ట్ర అధ్యక్షులు

(పాలడుగు భాస్కర్)
రాష్ట్ర కార్యదర్శి